


పెళ్ళయి మూడేళ్ళయింది.

రాజాగాడికి యేడాదినుండి నాలుగో నెల.

ఇంతవరకు హానీమూన్ కాదు కదా అనకాపల్లికూడ వెళ్ళలేదు. విశాఖపట్నం నుంచి కదిలి చాలా రోజులయింది.

ఎక్కడికైనా దూరప్రయాణం వెళ్ళి ఓ పదిరోజులు గడిపి రావాలని ఎంతో కోరిక. దేవికి మరీను. ఎన్నో చూడాలనీ-ఇంకెన్నో కొత్త విషయాలు తెల్సుకోవాలనీ.

తను మద్రాసు ఆఫీసు పనిమీద వెళ్ళి వచ్చాక అక్కడి సంగతులన్నీ చెప్పి చక్కని తిండితోసం తనెంత మొఖం వాచి పోయాడో చెబితే 'నన్ను కూడా తీసుకుపోతే మీకా యిబ్బంది వుండేది కాదుకదా - నాకూ కోరిక తీరేది' అంది. నిజమే తనకీ తీసుకు వెళ్ళాలనే వుండేది కానీ యేమిటో పరిస్థితులలా అడ్డు తగిలాయి.

ఈ సారి యేదో తెగించాడు.

ఎలాగూ ఈ యేడు బోనసు ఎక్కువ వస్తుంది. ఎప్పుడూ వున్న ఖర్చే ఎన్ని కొన్నా యింకా ఏదో లోటు వుండనే వుంటుంది.

యేమైనా సరే ఈసారి ఆ డబ్బుతో తిరుపతి, అట్నుంచటు మద్రాసు వెళ్లాలి - చిన్నప్పుడు యెప్పుడో చూసిందట దేవి - తన నిర్ణయాన్ని బలపరచింది. ఏ మాత్రం బలపరచక పోయినా ఆ డబ్బంతా మళ్ళీ సంసార గుండంలో పడిపోయేదే—

ఎంత ఖర్చయినా సరే ప్రయాణం సుఖంగా జరగాలనేది మొదట అనుకున్న విషయం. అందుకే అన్నిటికి రిజర్వేషన్లు బుక్ చేయడం జరిగింది.

మద్రాసు పోవు ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిముషములలో బయలు దేరనున్నది అరిగిపోయిన గ్రామఫోను రికార్డులలో ఎనౌన్స్‌మెంటు చెవిలో పడింది.

స్టేషనంతా పెళ్ళి వారిల్లులా జన సమూహంతో కిటకిటలాడి పోతూంది.

కూతవేసి రైలు కదిలింది.

తుళ్ళిపడ్డ రాజుగాడిని ఒడిలో చేర్చుకుని కిటికీ ప్రక్క కూర్చుని బైటకు చూడ్డం మొదలు పెట్టింది దేవి గాలికి ముంగురులు ఎగిరి పడుతున్నాయి ఎన్నాళ్ళ తర్వాతో ప్రయాణం. ఆమె ముఖంలో సంతృప్తి రేఖలు తాండవిస్తున్నాయి. ఎదురు గాలికి రాజా కళ్ళ మూతలు పడుతున్నాయి.

పొలిమేరలు దాటి పరుగులు పెడు తోంది రైలు. సాయంకాలపు నీరెండతో ప్రకృతంతా కొత్త అందాన్ని సంతరించు కుంది.

"అన్నట్టు... పిల్లిని బయటకు తరిమి తలుపువేశారు గదూ?" దేవి ప్రశ్నకు శాంతంగా ప్రకృతిని చూస్తూ మైమర చిన తను గతుక్కుమన్నాడు.

తను పిల్లిని బయటకు తరిమినట్లు గుర్తులేదు-ఫోంవేసి వచ్చి నేలమీద నడుం వాలుస్తూ చూశాడు యింట్లో పందిరి మంచంకింది నట్టిమంచం మీది పిల్లిని.

సుఖ నిద్రలో వుంది పిల్లి.

"వెళ్ళేటప్పుడు దీన్ని బయటకుతరిమి మరీ వెళ్లాలి. జ్ఞాపకముంచుకు చెప్పు." అన్నాడు అప్పుడే దేవితో!

దేవి మర్చిపోయినట్లుంది!

"ఇప్పుడా చెప్పటం, ఆ తెలివి ముందే యేమైంది. నాకు మతిమరుపని గదా నీకు చెప్పింది" దేవి మీద కోపం ముంచు కొచ్చింది.

"బాగుంది మధ్య నేనా దొరికాను. సామానుతో ముందు నన్ను వెళ్ళమని తర్వాత మీరేగా తలుపు వేసుకొచ్చారూ."

భార్య సమాధానం నచ్చలేదు.

యేమైతేనేం తను పిల్లిని బైటకు తరమలేదు కొండంత నవతాళ్ మాత్రం గుమ్మానికి తగిలించి ప్రక్కింటి వాళ్ళతో యింటిని భద్రంగా చూడమని మరీవచ్చాడు.

వెధవ పిల్లి యింట్లో వుండిపోతే ఛస్తుంది

ఒకటా రెండా పదిరోజుల కేంపు— దానికి గాలి తప్ప జీవించడానికి మరేదీ దొరకదు

బెడ్ రూంకి సంబంధించిన తలుపులన్నీ బిగించేశాడు అప్పుడన్నా గుర్తురాలేదు

"దానికి పెరుగన్నం పెట్టి పాలుపోసి చేరదీసింది నువ్వు—ఇప్పుడు చూడూ చేతులారా చంపినట్లవుతుంది" భార్య నుద్దేశించి అన్నాడు

"బావుంది నేనేం చేరదీశాను అదే కిందపడ్డ మెతుకులు యేరుకు తినేది. డొక్కలెండి ఆకలితో మాడిపోయినా దానికి పట్టెడు మెతుకులు దొరికింది లేదు అయినా ఈ మాత్రం దానికే చస్తుందా - కాకపోతే డొక్కలు మాడి చిక్కి సగమౌతుంది"

భార్య మాటలకు కొంత ధైర్య మొచ్చింది. కానీ యేది యేమైనా తెలిసో తెలియకో దాని ప్రాణానికి తనుకష్టాన్ని కలిగించిన వాడౌతాడు

అసలా పిల్లి తన యింటికొచ్చి రెండు నెలలవలేదు ఎదురింటి పెద్ద పిల్లి ఈని ఒక పిల్లని తమ యింట్లో వదలి వెళ్ళింది దాన్ని వదలించుకోడం కోసం చాలపాట్లు పడాల్సి వచ్చింది కానీ సాధ్యం కాలేదు. ఎంత దూరం తీసుకెళ్ళి వదిలినా తిన్నగా మళ్ళీ వచ్చేది

"పిల్లి కూనే గదండి పోనీ వుండ నివ్వండి" అంది దేవి

"ఛట్ అదేం కుదర్దు-పొద్దున్న లేచిం దగ్గర్నుంచి దీన్ని చూసుకోడంతోటే సరి పోతోంది" అన్నాడు తను—కానీ ఎంత విసిరి కొట్టినా దానికి కదల బుద్ధి కాలేదులా వుంది మొండికేసి వుండిపోయింది

రోజులు గడుస్తున్న కొద్దీ రాజా గాడి కనిపెట్టిన పాలు తాగేయటం, తింటున్న కంచంలో మూతి పెట్టడం, అలమరలోని పెరుగు గాజు సామానులు తిరగతోయడం అది చేసేపనికి అంతూ పొంతూ లేకపోయింది

"మచ్చిక చేస్తే బాగానే వుంటుంది" అంది దేవి చివరికి

మౌనం వహించక తప్పలేదు

ఆ తర్వాత ఇది తిండికి వేరేకంచం

రాజాగాడి కాళ్ళమధ్య చేరి ఆటలు

దాని అల్లరికి హద్దేలేదు

యేడికే రాజాగాడు కూడా పిల్లి కంట పడితే చాలు దాంతో పరుగెడుతూ ఆటలు మొదలు పెట్టేవాడు